సాక్షి
విశాఖపట్నం

గురువారం । 18 । జూలై । 2024



సింహగిరికి పోటెత్తిన భక్తులు

తొలి ఏకాదశి పురస్కరించుకుని బుధవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. 8లో



సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక బుధవారం కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టారు. 8లో



'ఆక్వాసాగు'పై అధ్యయనం

శ్రీలంకలో ఆక్వాసాగు అభివృద్ధికి రాష్ట్రంలో హేచరీల్లో అధ్యయనం చేస్తున్నట్లు శ్రీలంక మత్స్య, పోర్టుల శాఖ మంత్రి తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

డీఐజీగా గోపీనాథ్ జట్టి బాధ్యతల స్వీకరణ



సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్ జట్టి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గోపీనాథ్ 2010 అక్టోబర్ నుంచి 2011 మార్చి వరకు గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా, 2011 ఏప్రిల్ నుంచి 2013 ఏప్రిల్ వరకు చింతపల్లి ఏఎస్పీగా, 2013 నుంచి 2014 వరకు గుంటూరు ఎస్పీగా, 2014 నుంచి 2016 వరకు తిరుపతి ఎస్పీగా, 2016 నుంచి 2017 వరకు 6వ బెటాలియన్ కమాండెంట్‌గా, 2017 నుంచి 2018 వరకు కర్నూల్ ఎస్పీగా, 2019 నుంచి 2022 వరకు టీటీడీ చీఫ్ విజిలెన్స్ అధికారిగా, 2022 ఏప్రిల్ నుంచి గ్రే హౌండ్స్ డీఐజీగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పరిధిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని వెల్లడించారు. గంజాయిని నిర్మూలనకు చర్యలు చేపడతానన్నారు.

రెండు హోటళ్లపై కేసులు



ఆహార పదార్థాలు తనిఖీ చేస్తున్న ఆహార భద్రతాధికారి అప్పారావు

జగదాంబ/బీచ్‌రోడ్డు: సూర్యాబాగ్‌లోని సైన్ ట్రైన్ రెస్టారెంట్, వీఐపీ రోడ్డులోని వైజాగ్ కెమిస్ట్రీ హోటళ్లపై కేసులు నమోదయ్యాయి. ఈ హోటళ్లను బుధవారం తనిఖీ చేసిన జిల్లా ఆహార భద్రత అధికారి(డివిజన్-3) జి.వి.అప్పారావు.. వారు వినియోగిస్తున్న నూనెను టీపీసీ మీటర్ ద్వారా పరిశీలించారు. టీపీసీ విలువ 36.5 శాతం కంటే ఎక్కువగా ఉండటంలో హోటళ్ల యజమానులపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. ఈ నూనెను వినియోగించడం వల్ల క్యాన్సర్, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలాంటి నూనెలో బాగా ఫ్రై చేసిన ఆహార పదార్థాలు తినకూడదని వినియోగదారులను హెచ్చరించారు. ఎక్కువ సార్లు నూనెను మరిగించి ఆహార పదార్థాలు తయారు చేసే సంస్థలపై కేసు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. వాడిన నూనెను బయో డీజిల్ తయారీకి విక్రయించేలా యజమానులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార సంబంధిత ఫిర్యాదులకు 98490 47761, 97736 83667, 95667 60283, 99121 99284లను సంప్రదించవచ్చు.

రైల్వేస్టేషన్‌లో స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు



ప్లాట్‌ఫాంపై స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఈబీ బృందం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో స్నిఫర్ డాగ్స్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, అడిషనల్ ఎస్పీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోల ఆధ్వర్యంలో గంజాయి నియంత్రణలో భాగంగా విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫాంలు, వెయిటింగ్ హాల్స్, పార్సిల్ కార్యాలయాల్లో తనిఖీలు జరిగాయి. ఎస్‌ఈబీ సీఐలు టి.వెంకటప్పల నాయుడు, సిహెచ్ రాజులునాయుడు, ఎస్‌ఐ ఎస్.ముసలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శివశంకర్‌కు రావిశాస్త్రి పురస్కారం

సీతంపేట: రావిశాస్త్రి స్మారక పురస్కారం-2024ను ప్రముఖ కవి, విమర్శకులు, కథా రచయిత డాక్టర్ పాపినేని శివశంకర్‌కు ప్రదానం చేయనున్నట్లు రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 30న రావిశాస్త్రి జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘు రామారావు ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

పర్యాటకానికి గ్రహణం!



- వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులపై నీలినీడలు?
- ముందుకు సాగని ప్రాజెక్టుల ప్రతిపాదనలు
- ఆయోయంలో నేచ్యురల్ హిస్టరీ పార్క్, సైన్స్ మ్యూజియం, ఓషన్‌డెక్, అమ్యూజ్‌మెంట్ పార్క్ ప్రాజెక్టులు
- రూ.కోట్లు వెచ్చించి డీపీఆర్‌లు సిద్ధం చేసిన అధికారులు
- ఆ ప్రతిపాదనలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

విశాఖ సిటీ : విశాఖ పర్యాటకానికి గ్రహణం పట్టింది. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గత ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను బుట్టదాఖలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం విభిన్నమైన, ఆకర్షణీయమైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఇందుకు తగ్గట్టుగా విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) కొన్ని కీలక ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రాజెక్టుల అభివృద్ధికి



ఓషన్ డెక్ డిజైన్

రూ.కోట్లు వెచ్చించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు సైతం రూపొందించింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వీఎంఆర్‌డీఏ ఇచ్చిన ప్రతిపాదనలపై తాజా కూటమి ప్రభుత్వం విముఖత వ్యక్తం చేస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

విశాఖ అభివృద్ధి ఆటంకంగా..

చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రతి ప్రాజెక్టును అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని భావించారు. దీంతో అమరావతికి ముప్పువాటిల్లుతుందని భావించిన చంద్రబాబు టీమ్.. విశాఖ ప్రతిష్టను దిగజార్చేలా అనేక కుట్రలకు పాల్పడింది. ఇందులో భాగంగా విశాఖ పర్యాటక అభివృద్ధికి గత ప్రభుత్వం చేసిన ప్రణాళికలపై బురదజల్లే ప్రయత్నాలు చేసింది. ఎటువంటి పర్యాటక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినా.. దాన్ని అడ్డుకోవడానికి ఏదో ఒక సాకుతో కేసులు వేయిస్తూ, సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తూ వచ్చింది. గత ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతీ ప్రాజెక్టుకు నగరం అనువైన ప్రాంతం కాదని.. విశాఖ బ్రాండ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేసింది. వైఎస్సార్ ప్రభుత్వం చేసే ప్రతి ప్రాజెక్టు రాకుండా చేయడానికి ప్రయత్నించిన చంద్రబాబు.. ఇప్పుడు గత ప్రభుత్వ ప్రతిపాదనలను సైతం పక్కనపెట్టాలని ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఫలితంగా విశాఖ పర్యాటకాభివృద్ధికి దోహదం చేసే ప్రాజెక్టుల ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల రూపకల్పనకు వీఎంఆర్‌డీఏ అధికారులు రూ.కోట్లు వెచ్చించి డీపీఆర్‌లు సిద్ధం చేయించారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లని పక్షంలో డీపీఆర్‌లకు అయ్యే ఖర్చు వృథా కానుంది. 2014-19లో విశాఖలో ఒక్క ప్రాజెక్టును ప్రారంభించని టీడీపీ ప్రభుత్వం ఈసారైనా సిద్ధంగా ఉన్న ప్రాజెక్టు ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా? లేదా? అన్నది వేచి చూడాలి మరి.

పర్యాటక ప్రాజెక్టులకు అడుగులు పడేనా..



సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నమూనా

విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వీఎంఆర్‌డీఏ పలు కీలక ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. ఈ ప్రాజెక్టుల అడుగులు ఇప్పుడు ముందుకు పడతాయో? లేదో? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- గ్లాస్ బ్రిడ్జ్‌పై నడుస్తూ సముద్ర అందాలను ఆస్వాదించేలా.. రూ.7.8 కోట్లతో వీఎంఆర్‌డీఏ పార్క్‌కు ఆగ్నేయంగా సముద్రం ఒడ్డు నుంచి సముద్రం లోపలకు 91 మీటర్ల పొడవుతో ఓషన్ డెక్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఏఎంఎల్) డిజైన్ సిద్ధం చేసింది.
- కైలాసగిరిపై రూ.4.69 కోట్లతో సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ అధికారులు పంపించిన ప్రతిపాదనలకు గత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
- రూ.40 కోట్ల అంచనా వ్యయంతో పీపీపీ పద్ధతిలో అమ్యూజ్‌మెంట్ పార్క్, గేమింగ్, ఫన్, స్కేటింగ్, అక్వేరియం.. ఇలా అన్నీ రకాల ఆహ్లాద, వినోద కేంద్రాలు ఒకే చోట విశాఖ ప్రజలను అలరించేలా పోలీస్ బ్యారెక్స్ సమీపంలో వైశాఖి జల ఉద్యానవనం స్థలంలో 'ఎంటర్‌టైన్‌మెంట్, ఫన్ జోన్'కు ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణకు వీఎంఆర్‌డీఏ బిడ్లు సైతం ఆహ్వానించింది.
- రూ.18 కోట్లతో కైలాసగిరిపై కాటేజీలు, రివాల్వింగ్ రెస్టారెంట్ ప్రాజెక్టు పనులను తిరిగి చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేసింది.
- కాపులుప్పాడ ప్రాంతంలో నేచురల్ హిస్టరీ పార్కు అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేశారు.

ఇలా మరికొన్ని పర్యాటక ప్రాజెక్టులకు వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

20, 21న అప్పన్న దర్శన వేళల్లో మార్పులు

ఆర్జిత సేవలు రద్దు



సింహాచలం: ఈ నెల 20న జరిగే గిరి ప్రదక్షిణ, 21న జరిగే వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ ప్రదక్షిణ పురస్కరించుకుని స్వామి దర్శన వేళల్లో మార్పు చేసినట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. 20, 21 తేదీల్లో అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన టికెట్లు, సాయంత్రం ఆరాధన టికెట్లు కూడా రద్దు చేసినట్లు చెప్పారు. ఈ రెండు రోజుల్లో ఆలయ నీలాద్రి గుమ్మం నుంచే భక్తులకు దర్శనాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా 20న గిరి ప్రదక్షిణ చేసి అదే రోజు రాత్రికి తిరిగి సింహాచలం చేరుకునే భక్తుల సౌకర్యార్థం రాత్రి 10 గంటల వరకు దర్శనాలు కల్పిస్తామన్నారు. 21న ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు సుప్రభాతసేవ, 2 గంటల నుంచి 3 గంటల వరకు తుది విడత చందన సమర్పణ ఉంటుందన్నారు. ఆ రోజు తెల్లవారు జామున 3 గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతి ఇస్తున్నట్టు వెల్లడించారు. ముందురోజు గిరి ప్రదక్షిణ చేసి సింహగిరికి చేరుకున్న భక్తులందరికీ ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందిస్తామన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు ఢిల్లీ ఉత్సవం నిర్వహిస్తామని, ఆ సమయంలో దర్శనాలు లభించవని స్పష్టం చేశారు. తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు, తిరిగి రాత్రి 8.30 గంటల నుంచి 9 గంటల వరకు దర్శనాలు లభిస్తాయన్నారు.

20న సాయంత్రం 4 గంటలకు పుష్పరథం ప్రారంభం

ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని ఈ నెల 20న సాయత్రం 4 గంటలకు కొండ దిగువ తొలిపావంచా నుంచి స్వామి పుష్పరథం ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు. సింహగిరి చుట్టూ ఉన్న 32 కిలోమీటర్ల రథం ప్రదక్షిణ చేసి తిరిగి రాత్రి 10 గంటలకు సింహాచలం చేరుకుంటుందని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



మాతం ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

దాబాగార్డెన్స్: ముస్లింలు భక్తి శ్రద్ధలతో బుధవారం మొహర్రం జరుపుకొన్నారు. అంజుమన్ హుస్సేని మసీదు సంఘం అధ్యక్షుడు ఘాజీ అబ్బాస్, ఉపాధ్యక్షుడు షాహిద్ హుస్సేన్, కార్యదర్శి రజా ఆఘా, కోశాధికారి అక్బర్ నేతృత్వంలో చెంగల్రావుపేటలోని మసీదు నుంచి అమరులను స్మరించుకుని.. మాతం(రక్తతర్పణం) ప్రదర్శన నిర్వహించారు. మసీదు నుంచి ప్రారంభమైన మాతం ఏవీఎన్ కాలేజ్, కాలేజ్ డౌన్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు, టౌన్‌కొత్త రోడ్డు, పంజా జంక్షన్ మీదుగా తిరిగి మసీదుకు చేరుకుంది. కులమతాలకతీతంగా పలువురు దట్టీలు సమర్పించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాతం ప్రదర్శన, మొహర్రం సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్త్ ఏర్పాటు చేశారు.



ప్రదర్శనలో పాల్గొన్న ముస్లిం చిన్నారులు

సముద్రంలో బోటు బోల్తా

- సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు
- బోటు యజమానికి రూ.40 లక్షల నష్టం

మహారాణిపేట: చేపల వేట కోసం విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి పూడిమడక వైపు వెళ్లిన బోటు.. అప్పికొండ వద్ద ప్రమాదానికి గురైంది. బుధవారం సముద్రంలో అలల తాకిడి అధికంగా ఉండడంతో ఈ ప్రమాదం జరిగింది. బోటులో ఉన్న మత్స్యకారులు సముద్రంలోకి దూకి.. ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. వివరాలివీ.. ఈ నెల 14న ఫిషింగ్ హార్బర్ నుంచి దూడ దాసుకు చెందిన ఐఎన్‌డీ-ఏపీ-వీ5-ఎంఎం-245 బోటు వేటకు వెళ్లింది. అప్పికొండ వద్ద బుధవారం మత్స్యకారులు వేట సాగిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత వాతావరణంలో మార్పులతో అలల తాకిడి పెరిగింది. ఇంకో వైపు ఈదురు గాలులు విపరీతంగా వీయడంతో ఈ బోటు బోల్తా పడింది. ప్రమాద సమయంలో బోటులో డ్రైవర్‌తో పాటు 8 మంది కలాసీలు ఉన్నారు. అప్పటికే వేటాడిన మత్స్య సంపద కూడా అందులోనే ఉంది. కాగా.. ఈ ఘటనలో బోటులో ఉన్న ఎనిమిది మంది మత్స్యకారులు సముద్రంలో దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈదుకుంటూ అప్పికొండ ఒడ్డుకు చేరుకున్నారని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు. ఈ ప్రమాదంలో బోటు యజమానికి రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ ఘటనపై మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపి.. బోటు యజమానికి నష్టపరిహారం చెల్లించాలని జానకీరామ్ కోరారు.



ప్రమాదానికి గురైన బోటు

శేషపాన్పుపై జగన్నాథుడు

నేడు తిరుగుయాత్ర

దాబాగార్డెన్స్: జగన్నాథ రథోత్సవంలో భాగంగా చివరి రోజైన బుధవారం స్వామి శేషపాన్పుపై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామిని మేల్కొలిపారు. ప్రార్థనాతరంగిణి, సామూహిక లలితా సహస్ర నామ పారాయణ జరిగింది. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సహకారంతో మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథుడు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. చివరి రోజు స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో గుండిచా మందిర ప్రాంగణమంతా కిక్కిరిసింది. కాగా.. స్వామి గురువారం తిరుగు పయనం కానున్నారు. ఉదయం 9.15 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానిస్తారు. సాయంత్రం 5.10 గంటల నుంచి జగన్నాథ నామస్మరణతో వేదపండితుల పారాయణాలతో తిరుగు రథయాత్ర ప్రారంభమవుతుంది. 19న సంప్రోక్షణ పీఠారోహణం, స్వామిని యథాస్థానంలోకి అధిష్టింపజేస్తారు. ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఆలయ అర్చకులు జగన్నాథాచార్యులు, రంగనాథాచార్యులు, ఏడిద సురేష్‌బాబు, వివిధ ఆలయాల సిబ్బంది పాల్గొన్నారు.



శేషపాన్పుపై భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథుడు



స్వామి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

జీవీఎంసీ అస్తవ్యస్తం

- కమిషనర్ లేక గాడి తప్పిన పాలన
- వార్డుల్లో తిష్టవేసిన సమస్యలు
- బిల్లులు పాస్ కాక కాంట్రాక్టర్ల గగ్గోలు
- కార్మికులకు జీతాలు ఇవ్వని దుస్థితి
- నూయిజ్‌ఫాంకే పరిమితమైన క్లాప్ వాహనాలు
- అడ్డూ అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు



గాజువాక పార్కింగ్ యార్డులో నిలిచిన క్లాప్ వాహనాలు

దాబాగార్డెన్స్: మహా విశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ) అస్తవ్యస్తంగా తయారైంది. వార్డుల్లో ఎక్కడికక్కడ సమస్యలు తిష్టవేసినా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బిల్లులు పాస్ కాకపోవడంతో పనులు జరగడం లేదు. కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు సక్రమంగా అందకపోవడంతో వారంతా లబోదిబోమంటున్నారు. బిల్లులు అందక కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతుంటే.. జీతాలు అందక క్లాప్ డ్రైవర్లు వాహనాలను నూయిజ్‌ఫాంకే పరిమితం చేశారు. జీవీఎంసీ పరిధిలో జోరుగా సాగుతున్న అక్రమ/అనధికార నిర్మాణాలపై స్పందించాల్సిన పట్టణ ప్రణాళికా విభాగం.. ఉందో లేదో అన్నట్టుగా ఉంది. కౌన్సిల్ సమావేశం జరిగి ఏడు నెలలు కావస్తోంది. స్థాయీ సంఘ సమావేశాలు కూడా జరగని పరిస్థితి ఉంది. కమిషనర్ బదిలీపై వెళ్లి దాదాపు పక్షం రోజులు గడుస్తోంది. ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో జీవీఎంసీలో పాలన గాడి తప్పింది.

మేయర్ లేఖ రాసినా..

కౌన్సిల్, స్థాయీ సంఘ సమావేశం నిర్వహించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పూర్వ కమిషనర్ సాయికాంత్ వర్మకు లేఖ రాశారు. ఆ లేఖకు ఎటువంటి స్పందన రాలేదు. ఇంతలో ఆయన్ని ఇక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఇన్‌చార్జి కమిషనర్‌గా కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించింది. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధిక సమయం జిల్లాకు సంబంధించిన విషయాలపైనే దృష్టి సారించడంతో జీవీఎంసీ పరిధిలో సమస్యలు తిష్టవేశాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క ఫైల్ కూడా నడవలేదు. ఇన్‌చార్జి కమిషనర్ కూడా ఇప్పటి వరకు జీవీఎంసీకి చెందిన పెండింగ్ ఫైల్స్‌పై కన్నెత్తి చూడలేదు. దీంతో ఎవరు ఎలా విధులు నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. అక్రమ/అనధికార నిర్మాణాలపై స్పందించాల్సిన పట్టణ ప్రణాళికా విభాగం ఎక్కడా కానరావడం లేదు. నగరంలో విష జ్వరాలు అధికమవుతున్నా.. పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ప్రభుత్వం మారిన నాటి నుంచి అన్ని బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి.



పర్యవేక్షణ లోపంతో ఇలా..

ఎక్కడికక్కడే చెత్త

నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న క్లాప్ వాహనాలు నూయిజ్‌ఫాంకే పరిమితమయ్యాయి. ప్రతి నెలా 10వ తేదీలోగా క్లాప్ వాహనాల డ్రైవర్లకు జీతాలు అందాలి. కానీ ఈ నెల 17వ తేదీ వచ్చినా జీతాలు అందకపోవడంతో ఆయా వాహన డ్రైవర్లు వాహనాలు తీయలేదు. బిల్లులు పాసవ్వకా కొంత మంది కాంట్రాక్టర్లు క్లాప్ వాహనాల డ్రైవర్లకు జీతాలు చెల్లించలేదు. జోన్-2, జోన్-6 పరిధిలో తప్పా మిగిలిన అన్ని జోన్లలో క్లాప్ వాహనాలు తిరగలేదు. దీంతో పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ చెత్త రాజ్యమేలుతోంది. దోమలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

కౌన్సిల్ ఏర్పాటు చేయాలని చెప్పాం



ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ 1955 ప్రకారం కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి. దాదాపు ఏడు నెలలు కావస్తున్నా కౌన్సిల్ సమావేశం నిర్వహించలేకపోయారు. ఫలితంగా జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల్లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని గతంలో కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాను. కానీ ఫలితం లేకపోయింది.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

అప్పన్నను దర్శించుకున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి


గోపీనాథ్ జట్టికి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

వృద్ధుడిపై మెకానిక్ దాడి

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు రైతుబజార్‌లో నర్సరీ నడుపుతున్న వృద్ధుడిపై మద్యం మత్తులో మెకానిక్ దాడి చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలివీ.. రైతుబజార్‌లో అబ్బులు నర్సరీ నడుపుతున్నాడు. అతని వద్ద నుంచి బైక్ మెకానిక్ నిత్యం నీరు పట్టుకుని వెళ్తుంటాడు. కాగా.. రైతుబజార్ ఎస్టేట్ అధికారి బయట వ్యక్తులకు నీరు ఇవ్వొద్దని అబ్బులను ఆదేశించారు. దీంతో ఆయన మెకానిక్‌కు నీరు ఇవ్వడం నిలుపుదల చేశారు. దీనిపై కక్ష పెట్టుకున్న మెకానిక్ మంగళవారం మద్యం సేవించి.. బైక్‌తో అబ్బులు దుకాణాన్ని ఢీకొట్టాడు. అంతటితో ఆగకుండా వృద్ధుడిని రైతుబజార్ మొత్తం పరుగులు పెట్టించి దాడి చేశాడు. ఈ ఘటనలో ఆయనకు వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై మూడో పట్టణ పోలీసులకు అబ్బులు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేపట్టారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు

- తొలి ఏకాదశి నాడు స్వామి దర్శనం
- బారులుదీరిన క్యూలు

సింహాచలం: తొలి ఏకాదశి పురస్కరించుకుని బుధవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉచిత, రూ.100 టికెట్ల క్యూలు భక్తులతో బారులు దీరాయి. మాడవీధులు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించుకున్నారు. సాయంత్రం స్వామి తిరువీధి విశేషంగా జరిగింది. స్వామి ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్ఠింపజేసి సాయత్రం 5 గంటల నుంచి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. దేవస్థానం స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, అర్చకులు పవన్‌కుమారాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కిటకిటలాడిన ఉపమాక ఆలయం

నక్కపల్లి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్రలో ప్రముఖ పుణ్య క్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయం రద్దీగా మారింది. వీరి దర్శనానికి ఎటువంటి ఇబ్బంది పడకుండా తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గాలి గోపురం ఎదురుగా అఖిలాండం వరకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులంతా క్యూలైన్లో నడిచి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున మూడు గంటలకు గరుడాద్రిపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించిన పిదప భక్తులకు దర్శనం కల్పించామని ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు శేషాచార్యులు, కృష్ణమాచార్యులు తెలిపారు. అనంతరం కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, స్వామివారి ఉత్సవమూర్తుల వద్ద, ఆండాళ్లమ్మ వారి సన్నిధిలో రోజువారి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి ఉత్సవమూర్తులు వేణుగోపాలస్వామి, ఆండాళ్లమ్మవారిని నూతన వస్త్రాలతో వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా అనకాపల్లి, విశాఖపట్నం, యలమంచిలి నర్సీపట్నం, తుని, అడ్డురోడ్డు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు రావడంతో క్యూలైన్లో వెళ్లి స్వామివారిని దర్శించుకునేందుకు గంటకు పైగా సమయం పట్టింది. టీటీడీకి చెందిన విజిలెన్స్ విభాగం వారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సాయంత్రం ఉపమాకకు చెందిన శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో స్వామివారి గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు.


సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు


ఉపమాక ఆలయంలో స్వామి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


నూతన వస్త్రాలంకరణలో అమ్మవారు


స్వామి దర్శనానికి క్యూలో భక్తులు

బెంబేలెత్తిస్తున్న రియాక్టర్లు


వసంత్ కెమికల్స్ ఫ్యాక్టరీలో ఎగసి పడుతున్న మంటలు

- మృత్యువాత పడుతున్న కార్మికులు
- సహాయక చర్యల వేగవంతానికి కలెక్టర్ ఆదేశం



వసంత్ కెమికల్స్ ఫ్యాక్టరీ

అచ్యుతాపురం: పొట్ట చేతపట్టుకొని ఫార్మా కంపెనీల్లో చేరుతున్న కార్మికులకు రియాక్టర్ల భయం వెన్నాడుతోంది. రాంబిల్లిలో వసంత్ ఫార్మా కంపెనీలో 'ఏ' షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఒడిశా కార్మికుడు ఆ సమయంలో ఒక్కడే ఉండడంతో అతనిని రక్షించడం వీలు కాలేదు. రియాక్టర్ సమీపంలోని సేఫ్టీ వాల్ దగ్గర పనిచేస్తున్న సదరు కార్మికుడు అక్కడి మంటల వ్యాప్తి ద్వారా విస్తరించిన వాయువుల్ని పీల్చడం, మంటల్లో కాలిపోయి గుర్తు పట్టలేని విధంగా మారడం తోటి కార్మికుల్ని కలచివేసింది. ఇటీవల కాలంలో అచ్యుతాపురం సెజ్ పరిధిలోని కంపెనీల భద్రతా ప్రమాణాలపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.పేరు మోసిన రంగుల కర్మాగారంలో పలువురు మృత్యువాత పడిన ఉదంతాన్ని రహస్యంగా ఉంచారు. మరో కంపెనీలో కార్మికుడు జారిపడి మృతి చెందిన సంగతి తెలిసిందే. రెండు మూడు ఫార్మా కంపెనీల్లో సుమారు పది మంది దాకా అగ్నికి ఆహుతయ్యారు. అత్యంత సున్నితమైన రియాక్టర్ల నిర్వహణలో లోపాలు ఉండటం, సాంకేతిక వైఫల్యాలు, నిష్ణాతుల పర్యవేక్షణ లేకపోవడం, ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించకపోవడం కార్మికుల మృత్యువాతకు కారణం అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై అధికారికంగా స్పందించేందుకు అధికారులెవ్వరూ ముందుకు రాకపోవడం గమనార్హం. వసంత్ ఫార్మాలో జరిగిన ప్రమాద తీవ్రత తగ్గించేందుకు కూడా ప్రయత్నాలు జరిగాయి. అంతర్జాతీయ దుస్తుల కర్మాగారంలో విష వాయువుల లీకేజీపై ఇప్పటికీ స్పష్టమైన నివేదిక లేకపోవడం గమనార్హం. ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు తర్వాత మౌనం దాలుస్తున్నారు. ఫార్మా కంపెనీల వద్ద నిత్య పర్యవేక్షణ, తనిఖీలు ఉండాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఉద్యోగాల కల్పనే కాకుండా కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.

ప్రమాద కారణాలపై విచారణ కమిటీ

రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ వీఎస్ఈజెడ్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఏపీపీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ప్రమాదానికి గల కారణాలపై 7 రోజుల్లోగా నివేదికను సమర్పించాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

సహాయక చర్యల వేగవంతానికి కలెక్టర్ ఆదేశం

తుమ్మపాల: అచ్యుతాపురం సెజ్‌లో వసంత కెమికల్స్ కంపెనీ బ్లాక్ -6 లో బుధవారం జరిగిన సంఘటన చాలా దురదృష్టకరమని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. సహాయక చర్యల వేగవంతానికి కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హలార్ కోటెడ్ ఆటో క్లేవ్ రియాక్టర్ పేలుడు వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఆమె పేర్కొన్నారు.. మృతి చెందిన కార్మికుడిని ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రదీప్ రౌత్ (44)గా గుర్తించారని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కంపెనీ యాజమాన్యం రూ.35 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు అంగీకరించినట్లుగా ఆమె తెలిపారు. దీంతోపాటు ఈఎస్ఐ బెనిఫిట్స్‌ను కూడా కుటుంబ సభ్యులకు అందించడం జరుగుతుందన్నారు. ప్రమాదంలో మరణించిన వ్యక్తి భార్య, ఇద్దరు పిల్లలు ఒడిశా నుంచి అనకాపల్లి బయలుదేరి వస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.

విశాఖ, కృష్ణా జట్ల విజయకేతనం


ఉత్కంఠగా సాగుతున్న మ్యాచ్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాలే వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా, విశాఖ, సెంట్రల్ జోన్ జట్లు విజయం సాధించాయి. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో బుధవారం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 46.5 ఓవర్లలో 190 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, రెస్టాఫ్ సౌత్ జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. జట్టులో మన్విత్‌రెడ్డి 70 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 37.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 69, హ్రితిక్ వర్మ 53, యువన్ 57 పరుగులు చేశాడు. దీంతో విశాఖ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో రెస్టాఫ్ నార్త్ జోన్ పై రెస్టాఫ్ సెంట్రల్ జట్టు విజయం సాధించింది.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

అగనంపూడి : వచ్చే నెలలో గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక బుధవారం గాజువాక మండలం, కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టారు. వాల్తేర్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సారథ్యంలో కణితి హైస్కూల్‌లో నిర్వహించిన ఎంపికల్లో విశాఖ జిల్లాలోని వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మామిడి రమణ మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరు జిల్లా వినుకొండ గుడ్‌షెపర్డ్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన జట్టు పాల్గొనుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సూర్యనారాయణ, కణితి హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం.మన్నాజీ, పీడీలు నారాయణరావు, లోవరాజు, దేముడుబాబు, భవానీ, రవి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం : పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో రీ షెడ్యూల్ చేశామని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరాల్సిన సంత్రగచ్చి - సికింద్రాబాద్ (07222) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు ఏడున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 7.50 గంటలకు బయల్దేరింది. బుధవారం మధ్యాహ్నం 11.25 గంటలకు షాలిమర్‌లో బయల్దేరాల్సిన షాలిమర్ - హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ గంటున్నర ఆలస్యంగా మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరింది. బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు షాలిమర్‌లో బయల్దేరాల్సిన షాలిమర్ - సికింద్రాబాద్ (22849) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నాలుగున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరింది. బుధవారం రాత్రి 7 గంటలకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - హౌరా (12840) ఎక్స్‌ప్రెస్ సుమారు మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 9.45 గంటలకు బయల్దేరింది.

సెప్టెంబర్‌లో టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు

తగరపువలస : రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 35 టైప్ పరీక్షా కేంద్రాల్లో టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ అసోసియేషన్ సభ్యుడు బల్లా వెంకటరావు తెలిపారు. సెప్టెంబర్ 28, 29న తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలతోపాటు ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్‌లలో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు. అలాగే అదే నెల 21, 22న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 6 కేంద్రాల్లో షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షార్ట్ హ్యాండ్ పరీక్షా కేంద్రాన్ని విజయవాడలో రద్దు చేసి గుంటూరులో నిర్వహిస్తారన్నారు. పరీక్ష లకు ఇంకా 70 రోజుల వ్యవధి ఉన్నందున అభ్యర్థులు గుర్తింపు పొందిన టైప్ ఇన్‌స్టిట్యూట్‌లను సంప్రదించి సమయం వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 96522 76443లో సంప్రదించాలని కోరారు.

23 నుంచి స్పెషల్ కేటగిరీ విద్యార్థుల పత్రాల పరిశీలన

మద్దిలపాలెం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 23, 24, 25 తేదీల్లో పరిశీలిస్తున్నట్లు మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. స్పెషల్ కేటగిరీలో ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్, ఎక్స్‌ట్రా కరిక్యులర్, క్యాప్(మాజీ సైనికుల పిల్లలు) ఉంటారన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన స్పెషల్ కేటగిరీ విద్యార్థులు కృష్ణా కళాశాలలో జరిగే ధ్రువీకరణపత్రాల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు.

ఆక్వాసాగు అభివృద్ధిపై అధ్యయనం

- శ్రీలంక మత్స్య, పోర్టుల శాఖ మంత్రి డగ్లస్ దేవానంద్


హేచరీలో ఆక్వా సీడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి

పాయకరావుపేట : శ్రీలంకలో ఆక్వాసాగు అభివృద్ధి చేయడం కోసం తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి హేచరీల్లో అధ్యయనం చేస్తున్నట్లు శ్రీలంక మత్స్య, పోర్టుల శాఖ మంత్రి డగ్లస్ దేవానంద్ తెలిపారు. ఆయన అధ్యయన బృందంతో కలిసి మండలంలోని పెంటకోట సమీపంలో ఉన్న శిల్పా హేచరీని బుధవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీలంకలో 1,400 హెక్టార్లలో 30 హేచరీలు ఉన్నట్లు తెలిపారు. వాటిలో పండుకప్ప, పీతల సాగుతో పాటు నాణ్యమైన రొయ్యలు ఉత్పత్తి చేయడం కోసం ఇక్కడి హేచరీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆక్వా సాగుకు తీసుకుంటున్న అంశాలు, ఉత్పత్తికి అవలంబిస్తున్న విధానాలపై హేచరీల యాజమాన్యాలను అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. శ్రీలంక మత్స్యశాఖ బృందం సభ్యులు డాక్టర్ అరుల్ రవీంద్రన్, నవీన్ వర్మ, శిల్పా హేచరీ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సిల్క్ ఎక్స్‌పోలో 50 శాతం రాయితీతో విక్రయాలు



డాబాగార్డెన్స్: రాబోవు వివాహ వేడుకలు దృష్టిలో పెట్టుకుని నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రత్యేకంగా మహిళల కోసం 50 శాతం రాయితీతో విస్తృత శ్రేణి వస్త్రాలు, ఉపకరణాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హోటల్ గ్రీన్ పార్క్ వేదికగా ఈ నెల 21 వరకు ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు చెప్పారు. భారతదేశంలోనే పేరెన్నిక గన్న వేలాది రకాల పట్టు వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు వంటివి ఒకే ప్లాట్‌ఫాంపైకి తీసుకురావడం జరిగిందన్నారు. ఎక్స్‌పోలో మహారాష్ట్ర పైఠాన్ సిల్క్ చీరలు, కర్ణాటక బెంగుళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్ నుంచి ప్రసిద్ధి చెందిన చందేరి, మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ నుంచి బలూచారి, జమదాని, టాంగైల్, ఢకాయ్ సిల్క్ వస్త్రాలు, లినెన్ కాంతా వర్క్ స్టిచ్ చీరలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పేరెన్నికగన్న వస్త్రాలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. అంతేగాక దుప్పట్లు, వివిధ డిజైన్స్ సల్వార్ మెటీరియల్స్, నమూనాలు, బిహార్ టస్సార్, మట్కా, భాగల్పూర్ సిల్క్, గుజరాత్ సంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా, తమిళనాడు కంజీవరం పట్టు చీరలతో పాటు జమ్ము తావి నుంచి వచ్చిన ఎంబ్రాయిడరీ సిల్క్, తావీ సిల్క్ చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు.

కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి

- కేసు నమోదు

నర్సీపట్నం : నర్సీపట్నం ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ చిట్టిబాబుపై చేయి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి తోటకూరపాలెం బస్సు బయలుదేరింది. అదే బస్సులో మాకవరపాలెం మండలం, కొండల అగ్రహారానికి చెందిన ఎస్.వెంకటేష్ బస్సులో ప్రయాణిస్తున్నాడు. విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ చిట్టిబాబు అతడిని టికెట్ తీసుకోమని కోరగా, వెంకటేష్ కండక్టర్‌తో దురుసుగా ప్రవర్తించి చేయి చేసుకున్నాడు. ఈ ఘటనపై కండక్టర్ నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.75,000
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.68,750
వెండి(కిలో):	రూ.1,00,000

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.112
స్కిన్	: రూ.194
స్కిన్‌లెస్	: రూ.204